76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21




# రాజధాని వార్తలు

Voice of Voiceless

రాజధాని వార్తలు పత్రికలో
ప్రకటన కొరకు సంప్రదించండి
వై.రాజశేఖర్
ఫోన్ : 98480 89624
మంగళగిరి, గుంటూరు,
విజయవాడ

అమరావతి సంపుటి : 4 సంచిక 28, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ ‘ రాజధాని’ తొలి తెలుగు వార పత్రిక సోమవారం 8 - ఆదివారం 14 ఏప్రిల్, 2019

వివరాలు2లో...



తెలుగు భాష - సంస్కృతి వికాసంపై ప్రభుత్వ అలసత్వం

వివరాలు3లో...



కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

వివరాలు4లో...



కావాల్సిన వాడు

వివరాలు4లో...



ప్రజలు ఏం చూసి ఓటు వేస్తారు..?

# గాజువాకలో గెలుపెవరిది ?

**రాజధాని వార్తలు, విశాఖ :** గాజువాకలో పవన్ తొలిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన ఇప్పటికి ఒక రోడ్ షోతో పాటు, ఓ సభ నిర్వహించి ఫ్యాన్స్ లో జోష్ నింపారు. మిగిలిన రెండు పార్టీలకు చెందిన అభ్యర్థులు స్థానికులు. దాంతో గాజువాక ప్రచారంలో సందడి ఎక్కువగా పవన్ వైపే ఉంటోంది. టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పటికి అనేకసార్లు విశాఖ వచ్చినా గాజువాక వైపు తొంగి చూడడంలేదు. ఏకంగా అభ్యర్థి పల్లా శ్రీనివాస్ ప్రచారం చేయాలని కోరినా బాబు మాత్రం ఎందుకో ఆ ఆలోచన చేయడంలేదు. దాంతో పవన్ మ్యానియా మాత్రమే పౌరుషం లేదా అని స్థానిక వైసీపీ నాయకుడిని తిట్టిపోశారు. దీంతో వైసీపీ కేడర్, స్థానికులు ఆయనకు వ్యతిరేకంగా మారిపోయారు. రెండోది పవన్ రాష్ట్రంలో రెండు చోట్ల పోటీ చేయడం ఏ నియోజక వర్గంలో ఉంటారో తెలపాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు. అంతేకాదు పౌరుషం గురించి మాట్లాడే పవన్ సినిమా టిక్కెట్ల రేటు పెంచడం కోసం కేసీఆర్ ఇంటివద్ద ఎన్ని గంటలు వేచిచూశారో రాష్ట్ర ప్రజలకు తెలుసని, సినిమా ఫంక్షన్లలో భుజాలపై చేతులేసుకుంది ఎవరో జనాలు చూశారని వైసీపీ కార్యకర్తలు మండిపడుతున్నారు. అందుబాటులో ఉండే నాయకుడినే ఎన్నుకుంటామని, ఎప్పుడో ఒకసారి వచ్చి పోయే వారని కాదని స్థానికులు స్పష్టం చేయడంతో ఇక వైసీపీలో కొత్త జోష్ కనిపిస్తోంది. బలమైన నాయకుడు, కార్మిక వర్గాన్ని కదిలించే మంత్రి చేరికతో వైసీపీ అభ్యర్థి తిప్పల నాగిరెడ్డి విజయావకాశాలు ఒక్కసారిగా పెరిగాయని చెప్పాలి. ప్రధానంగా ఇక్కడ కార్మికులు ఎక్కువగా

## జగన్ చివరి పర్యటనతో పవన్‌కు ఫులుస్టాప్ ?

అక్కడ కనిపిస్తోంది. ఇక వైసీపీ తరఫున ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తిప్పల నాగిరెడ్డి తన వరకు తానుగా ప్రచారం చేసుకుంటూ పోతున్నారు. ఈ సమయంలో గాజువాకను హీటెక్కించేందుకు వైసీపీ రంగం సిద్ధం చేసింది. ప్రచారం పరిసమాప్తం అయ్యే చివరి రోజు అంటే ఈ నెల 9న వైఎస్ జగన్ గాజువాక టూర్ పెట్టుకున్నారు. ఆ రోజున గాజువాక హోరెత్తించేలా భారీ రోడ్డు షోను నిర్వహించాలను వైసీపీ ప్లాన్. దాంతో లాస్ట్ పంచ్ జగన్ దే అవుతుందని వైసీపీ నేతలు అంటున్నారు. ఇదిలా ఉండగా నేతల చేరికతో వైసీపీ ఇప్పటికే అక్కడ బలంగా ఉంది. జగన్ ప్రచారంతో సీన్ మొత్తం మార్చేస్తామని కూడా ఆ పార్టీ నమ్ముతోంది.

వాస్తవానికి గాజువాక, భీమవరాల్లో ఏం జరుగుతుందా అని రాష్ట్రప్రజలు చూస్తున్నారు. అందుకు కారణం జనసేన అధిపతిగా పవన్ కల్యాణ్ అక్కడ పోటీ చేయడమే. భీమవరంలో గ్రంధి శ్రీనివాస్‌ను ఎదుర్కోవడం కష్టమని తేలిపోయింది. అదే సమయంలో అక్కడ తనపోటీని ప్రకటించే సమయంలో కేసీఆర్‌పై వ్యతిరేకత వ్యాఖ్యలు చేస్తూ, ఇక్కడి వారికి



ఆశలన్నీ గాజువాకపై పెట్టుకున్నారు.

గాజువాకలో పవన్ ఎంట్రీకి ముందు వైసీపీ, టీడీపీ మధ్యనే పోరు అన్నట్టుగా ఉండేది. పవన్ పోటీ అన్నాక ప్రధాన పార్టీలు ఒక్కసారిగా అలెర్ట్ అయ్యాయి. టీడీపీ, వైసీపీ సంస్థాగతంగా బలంగా ఉండడంతో పాటు కొత్త వ్యూహాలకు పదును పెడుతున్నాయి. గాజువాక మున్సిపల్ చైర్మన్ గా, పెందుర్తి ఎమ్మెల్యేగా తిప్పల ప్రజలకు చేసిందేమీ లేకపోవడంతో 2009 ఎన్నికల్లో వైఎస్ హవాలో సైతం ఆయన మూడవస్థానంతో ఓడిపోవాల్సివచ్చింది ఇక ఆయన అటు చేరగానే వైసీపీకి బంపర్ ఆఫర్ తగిలినట్లుగా గాజువాక ఇంటాక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆ పార్టీలోకి వచ్చేశారు. స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకుడిగా ఉంటూ వచ్చిన మంత్రి వెనక వేలాది మంది కార్మికులు ఉండడంతో ఇప్పుడు ఉంటారు. వైసీపీకి ఉన్న బలానికి తోడుగా మంత్రి రాజశేఖర్ కలసివస్తారని అంచనా కడుతున్నారు. పైగా బీసీవర్గం నేతకావడం కూడా మరో ప్లస్ పాయింటుగా ఉంది. నిజానికి మంత్రి రాజశేఖర్ ని టీడీపీ చేర్చుకోవాలనుకుంది. అయితే తిప్పల తురుమూర్తి రెడ్డితో ఉన్న విభేదాలు, వైసీపీకి ఉన్న ఆదరణ చూసే ఆయన ఇటువైపుగా వచ్చారని తెలుస్తోంది. ఇక మరోవైపు టీడీపీ కూడా ఎలాగైనా సీటుని నిలబెట్టుకోవాలనుకుంటోంది. పల్లా శ్రీనివాస్ సైతం బలమైన యాదవ సామాజికవర్గం నేత కావడంతో పాటు, అన్ని వర్గాలతో సంబంధాలు ఉండడం, అంతటా ఆయనకు బంధుగణం ఉండడం కలసివస్తుందని చెబుతున్నారు.

జనసేన విషయానికి వస్తే.. ఆయనకు ఉన్న గ్లామర్ ఆధారంగానే గెలవాలని చూస్తోంది తప్ప పార్టీ పరంగా అక్కడ సంస్థాగత నిర్మాణం పెద్దగా లేకపోవడం లోటుగానే ఉంది. అయినప్పటికీ పవన్ చరిష్మాతో నెగ్గుతారని జనసేన నేతలు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ అక్కడ కేడర్‌లో జోష్ నింపితే పవన్ పరిస్థితి ఎలా ఉంటుందో ?

# విజేతలెవరు?

**రాజధాని వార్తలు డెస్క్ :** రాష్ట్రంలో సార్వత్రిక పోరు పతాకస్థాయికి చేరింది. ఏ నియోజకవర్గం చూసినా నువ్వా ?నేనా ? అన్నట్లు ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. రాష్ట్ర విభజన తర్వాత ఇది రెండో ఎన్నిక కాగా, గత ఎన్నికకు ఇది పూర్తి భిన్నంగా ఉంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, వైసీపీల మధ్య మాత్రమే పోటీ నెలకొనగా, ప్రస్తుతం ఈ రెండు పార్టీలకు జనసేన, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ కూటమి కూడా బరిలో ఉంది. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు నియోజకవర్గాలకు టీడీపీ, వైసీపీ ఒంటరిగా పోటీ చేస్తుండగా, జనసేన-లెఫ్ట్ కూటమి తరఫున సీపీఐ రెండు ఎంపీ, 7 అసెంబ్లీ, సీపీఎం 2 ఎంపీ, 7 అసెంబ్లీ, బీఎస్పీ 3 ఎంపీ, 21 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తుంది. మిగిలిన స్థానాల్లో జనసేన పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఈకూటమి చీల్చే ఓట్లు ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో రకంగా ఉన్నాయి. ఒక నియోజకవర్గంలో వైసీపీకి, మరోచోట టీడీపీకి నష్టం కలిగే పరిస్థితి ఉంది. ఈ చీలిక జనసేన, కూటమి అభ్యర్థి విజయానికి దోహదపడుతుందా ? లేక తమను ఓడిస్తుందో అర్థంగాక ఆ రెండు పార్టీలు అభ్యర్థులు బెంబేలు పడుతున్నాయి. ఇక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విడివిడిగా పోటీ చేస్తున్నప్పటికీ డిపాజిట్లు దక్కించుకొని పరువు నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.



అధికారం తెలుగుదేశం పార్టీ దానిని కాపాడుకునే యత్నంలో ఉండగా, ఈసారి పాలనాపగ్గాలు చేపట్టాలని వైసీపీ ఎత్తుకు పై ఎత్తులు వేస్తోంది. ఇందుకోసం రెండు పార్టీలు డబ్బు, మద్యం ఏరులై పారిస్తున్నాయి టీడీపీ అధినేత చంద్రబాబు అంతా తానై రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేస్తున్నారు. కేంద్రం సహకరించకపోయినా, లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, అలాగే ప్రతి జిల్లాలో లెక్కనేనన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని వివరిస్తున్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో చేపడుతున్న అమరావతి రాజధాని నిర్మాణం ముందుకు సాగాలన్నా, ఏపీకి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుతోపాటు పెండింగ్‌లో ఉన్న ఇతర సాగునీటి ప్రాజెక్టులు పూర్తికావాలన్నా మరోసారి అధికారం ఇవ్వాలని కోరుతున్నారు. ఇక వైసీపీ తరఫున జగన్ కుటుంబం మొత్తం రంగంలోకి దిగింది. జగన్మోహనరెడ్డి, తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల, సతీమణి భారతిలు రాష్ట్రంలో నాలుగుదిక్కులా పర్యటిస్తూ అధికారాన్ని కైవసం చేసుకోవడమే

- మిగతా 2 లో

# కర్మయోగి

**రాజధాని వార్తలు :** బహుముఖ ప్రజ్ఞాశాలి, విశిష్ట స్వాతంత్ర్య సమరయోధుడు, వ్యాపార వేత్త బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్న ఉదార హృదయుడు, భగవత్‌గీతలో పేర్కొన్న కర్మయోగి.

కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు తాతగారి పేరు చినకోటయ్య గారు. నాయనమ్మ రత్తమ్మగారు. వీరికి ఇరువురు సంతానము. నాగభూషణరావు, నాగభూషణమ్మ. ఈ కుటుంబీకులు శివ భక్తులని పేరులను బట్టి తెలియుచునేయున్నది. నాగభూషణరావు సతీమణి సీతారావమ్మకు నలుగురు సంతానము. బసవ రాజ్యలక్ష్మీ దేవి, లక్ష్మీనరసింహారావు, బాలాత్రిపురసుందరి, విజయలక్ష్మి అనువారలు.

నాగభూషణరావుగారి జీవితంలోకి సీతారావమ్మగారిరాకతో వారి కుటుంబములో హరిహరము సమ్మిళతమైంది. లక్ష్మీనరసింహారావుగారి పేరు మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామివారి పేరుతో ముడివడియున్నది. వీరి జననము 1926 నవంబర్ 6వ తేది.

సంతానం : రామసీత, స్వర్ణతల, దేవీ ప్రసాద్, రత్నదుర్గ, కృష్ణ ప్రసాద్, శారదాదేవి, రాజేంద్రప్రసాద్, విజయభారతి, బాలకృష్ణ.

**ప్రాంతీయాభివృద్ధిపై దృష్టి**

1. గుంటూరు ఆడపిల్లల కమ్మ హాస్టలులో కంప్యూటరు నాలెడ్జి సెంటరు

- మిగతా 2 లో



కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు దంపతులు

## తెనాలి



వైకాపా అభ్యర్థి
అన్నాబత్తుని శివకుమార్

**బలాలు..**

- ప్రజలకు అందుబాటులో ఉండటం
- పార్టీ కేడర్ సపోర్టు
- సామాజిక ఆర్థిక సేవలు చేయటం



తెదేపా అభ్యర్థి
ఆలపాటి రాజేంద్రప్రసాద్

**బలాలు..**

- ఆధునిక విద్యవేత్త
- మంత్రిగా అనుభవం
- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు

## పొన్నూరు



వైకాపా అభ్యర్థి
కిలారి వెంకట రోసయ్య

**బలాలు..**

- ప్రజలకు అందుబాటులో ఉండటం
- పార్టీ కేడర్ సపోర్టు
- సామాజిక ఆర్థిక సేవలు చేయటం



తెదేపా అభ్యర్థి
ధూళిపాళ్లనరేంద్ర కుమార్

**బలాలు..**

- ఐదు సార్లు ఎమ్మెల్యేగా అపార అనుభవం
- బలమైన పార్టీ కేడర్
- సామాజిక వర్గ మద్దతు
- స్థానికుడు

## సత్తెనపల్లి



వైకాపా అభ్యర్థి
అంబటి రాంబాబు

**బలాలు..**

- నియోజకవర్గానికి అందుబాటులో ఉండటం
- బలమైన పార్టీ కేడర్
- ప్రజాసేవలో ముందుండటం



తెదేపా అభ్యర్థి
కోడెల శివప్రసాద్

**బలాలు..**

- మంత్రి, స్పీకర్‌గా అపారమైన అనుభవం
- నిత్యం ప్రజలకు సహాయం అందించడం
- బలమైన పార్టీ కేడర్

## పెదకూరపాడు



వైకాపా అభ్యర్థి
నంబూరి శంకర్రావు

**బలాలు..**

- విశేషమైన వ్యాపార అనుభవం
- పార్టీ కేడర్ సపోర్టు
- సామాజిక ఆర్థిక సేవలు చేయటం



తెదేపా అభ్యర్థి
కొమ్మాలపాటి శ్రీధర్

**బలాలు..**

- రెండు సార్లు ఎమ్మెల్యేగా అపార అనుభవం
- బలమైన పార్టీ కేడర్
- సామాజిక వర్గ మద్దతు
- స్థానికుడు

## నరసరావుపేట (లోక్‌సభ)



తెదేపా అభ్యర్థి, రాయపాటి సాంబశివరావు

**బలాలు..**


- ఎంపీగా అనుభవం
- బలమైన పార్టీ కేడర్
- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు



వైకాపా అభ్యర్థి, లావు శ్రీకృష్ణదేవరాయులు

**బలాలు..**

- పార్టీ కేడర్ సపోర్టు
- సామాజిక ఆర్థిక సేవలు చేయటం
- యువతకు ఉపాధి కల్పించడంలో ముందంజ



భాజపా అభ్యర్థి, కన్నా లక్ష్మీనారాయణ

**బలాలు..**

- అసలుసిసలైన రాజకీయవేత్త
- ఎన్నికల్లో పలుమార్లు విజయం

## గుడివాడ



వైకాపా అభ్యర్థి,
కొడాలి వెంకటేశ్వరరావు

**బలాలు..**

- మూడు సార్లు ఎమ్మెల్యేగా అపార అనుభవం
- బలమైన పార్టీ కేడర్
- సామాజిక వర్గ మద్దతు
- స్థానికుడు



తెదేపా అభ్యర్థి, దేవినేని అవినాష్

**బలాలు..**

- యువ నాయకుడు
- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు
- యువతకు ఆశాజ్యోతి
- ఓనమాలతోనే రాజకీయాలు

## చిలకలూరిపేట



వైకాపా అభ్యర్థి,
విడదల రజిని

**బలాలు..**

- ప్రజలకు అందుబాటులో ఉండటం
- పార్టీ కేడర్ సపోర్టు
- సామాజిక ఆర్థిక సేవలు చేయటం



తెదేపా అభ్యర్థి, పత్తిపాటి పుల్లారావు

**బలాలు..**

- మంత్రిగా అపారమైన అనుభవం
- నిత్యం ప్రజలకు సహాయం అందించడం
- బలమైన పార్టీ కేడర్
- ప్రజలకు అందుబాటులో ఉండటం

## ప్రత్తిపాడు



వైకాపా అభ్యర్థి
మేకతోటి సుచరిత

**బలాలు..**

- ప్రజలకు అందుబాటులో ఉండటం
- బలమైన పార్టీ కేడర్
- మహిళా సమస్యలపై స్పష్టమైన అవగాహన



తెదేపా అభ్యర్థి
డొక్కా మాణిక్యవరప్రసాద్

**బలాలు..**

- మంత్రిగా అపారమైన అనుభవం
- నిత్యం ప్రజలకు సహాయం అందించడం
- బలమైన పార్టీ కేడర్
- దళితుల ఆశాజ్యోతి

## రాజధాని వార్తలు కలం

# అద్వానీ పరితాపం

మనం ఏ విత్తనం వేస్తే అదే పంటను కోస్తాం. పిల్లలకు ఏం నేర్పితే అదే వంటబట్టించుకుంటారు. కాల భ్రమణంలో మనం చేసిందే మనకు చుట్టుకుంటుంది. తాత్కాలిక ప్రయోజనాల కోసం దేశంలోని లౌకిక వాదానికి గండికొట్టి, సుభిక్షమైన దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రథ యాత్ర చేపట్టి బీజేపీని ఉనికిలోకి తీసుకువచ్చిన కురువృద్ధుడు లాల్ కృష్ణ అద్వానీ (91) ఇప్పుడు తీరిగ్గా పరితాపం చెందుతున్నారు. ఎందుకంటే 1990 సెప్టెంబర్‌లో ఆయన ప్రారంభించిన రథయాత్ర ఆపై జరిగిన బాబ్రీ విధ్వంసం ప్రజలు మరిచిపోలేదు. ఆ రథయాత్రలో ఆయనకు అనేక సేవలు చేసిన నరేంద్ర మోడీ ఆతర్వాత గుజరాత్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. అద్వానీ, మరళీమనోహర్ జోషి నూరిపోసిన మతతత్వానికి గుజరాత్‌లో దారుణ మారణ కాండ జరిగింది. దీనిలో 2000 మంది మైనార్టీలు హత్యలకు గురయ్యారు. ఒక ముఖ్యమంత్రి కుల,మత విద్వేషానికి అంతమంది హతం కావడం ప్రపంచాన్ని నివ్వెర పరిచింది. అమెరికా మోడీ వీసాను తిరస్కరించింది. భూగోళంలోని అత్యంత క్రూరుడిగా ఆయనకు మొదటి స్థానం వచ్చింది. అయినా తర్వాతి కాలంలో ఆయనే ప్రధానిగా ఎదిగేందుకు పరిస్థితులు దోహదపడ్డాయి. అందుకు ప్రధాన జాతీయ పార్టీ కాంగ్రెస్‌కూడా కారణమే..కాంగ్రెస్ స్కామ్‌లతో నిండిపోవడం,వామపక్షాలు సిద్ధాంతాల పేరుతో చీలికలు పీలికలై పోవడంతో ప్రజలు మరో ప్రత్యామ్నాయం లేక ఆపార్టీని గెలిపించాల్సిన అగత్యం ఏర్పడింది. అదే సమయంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, 100 రోజుల్లో విదేశాల్లోని నల్లడబ్బు సామాన్య ప్రజల ఖాతాలో వేస్తాం. రైతులకు స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తాం.. మేక్ ఇన్ ఇండియా అనగానే మోడీకి భారీ ఓట్లు పడ్డాయి. వాస్తవానికి ప్రధాని అభ్యర్థిగా అద్వానీని ప్రకటించాల్సి ఉంది. వాజ్‌పేయి సమయంలో ఆయన లౌకికవాది కాదని ఆ పదవికి అనర్హుడిగా ప్రకటించగా, 2014 నాటికి ఆయనకంటే కరడు గట్టిన మతోన్మాదిగా రూపొందిన మోడీ వైపు ఆర్ఎస్ఎస్ మొగ్గడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఏమైతేనేం ప్రధాని పదవి అద్వానీకి అది అందని ద్రాక్షగా మిగిలిపోయింది. పోనీ రాష్ట్రపతిగా అయినా నియామకం చేస్తారంటే ఆ సమయానికి ఆయనపై కేసులు బయటికి తీశారు ప్రధాని. మోడీ ప్రధాని కావడం .. అద్వానీ గ్రాఫ్ పడిపోవడం ఒకేసారి జరిగాయి. బీజేపీ సీనియర్ నేతగా ఆయన గుర్తింపు, గౌరవానికి నోచుకోలేదు. కించిత్ గౌరవాభిమానాలు ప్రదర్శించకుండా 75 ఏళ్లు నిండిన వారికి ప్రజాప్రతినిధులుగా పోటీ చేసే అవకాశం లేదంటూ నిర్దాక్షిణ్యంగా ఆయనకు టికెట్ నిరాకరించారు. వాస్తవానికి ఆయన గౌరవార్థం ఒక కార్యక్రమం నిర్వహించి అద్వానీ పార్టీకి చేసిన సేవలను స్మరించుకొని ఆయనకు విశ్రాంతి ఇస్తున్నామంటే ఆయన కూడా సంతోషపడి ఉండేవారేమో..

1991 నుంచి ఆరుసార్లు ప్రాతినిధ్యం వహించిన గాంధీనగర్‌ను అద్వానీ నుంచి గుంజుకొని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆస్థానం నుంచి పోటీచేస్తున్నారు. దీనిపై రెండు రోజుల క్రితం అద్వానీ స్పందించారు. ఈనెల 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం కూడా కావడంతో ఆయన బ్లాక్‌లో భారీ లేఖను ఉంచారు.'బీజేపీని వ్యతిరేకించే వారు దేశద్రోహులుగా భావించే సంస్క ృతి పార్టీకి లేదు' అని 'రాజకీయంగా వ్యతిరేకించే వారు శత్రువులు కాదని, కేవలం ప్రత్యర్థులు' మాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో పాటు 'భిన్నత్వాన్ని, వాక్ స్వాతంత్ర్యాన్ని గౌరవించడమే భారతీయ ప్రజాస్వామ్యానికి మూలం' అని అన్నారు. భారతదేశ స్వతంత్రతను, సమగ్రతను, వ్యవస్థలను, మీడియాను కాపాడడం బీజేపీ బాధ్యత అని చెప్పారు. బీజేపీ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్న వేళ ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే లౌకికత్వాన్ని మంటగలిపి, గుజరాత్ అల్లర్లలో మోడీకి మద్దతు ఇచ్చిన అద్వానీ ఇప్పుడు వగచి మాత్రం ఉపయోగం ఏముంది ?

# కర్మయోగి

**(మొదటిపేజీ తరువాయి)**

ఏర్పాటుకు 10 లక్షలు.

2.ఆడపిల్లల కమ్మ హాస్టలులో రూము నిర్మాణానికి 1లక్ష.

3.కమ్మహాస్టలు అరండలుపేట 1లక్ష.

4.కాకతీయ స్టూడెట్సు వెల్‌ఫైర్ సొసైటీకి 6 లక్షలు.

5.తాగికొండ డిగ్రీ కాలేజీకి కంప్యూటర్లు 0.75 లక్షలు.

6.నలసరావు పేట కమ్మహాస్టలుకు అందజేసిన కంప్యూటర్లకు 1 లక్ష.

7. నిమ్మగడ్డ ఫౌండేషను హైస్కూలు, దుగ్గిరాల 1 లక్ష.

8. కొత్త రఘురామయ్య డిగ్రీ కళాశాల, దుగ్గిరాల 1 లక్ష.

9. తమిళనాడు రాష్ట్రములోని తిరువన్నామలైలో గల శ్రీ రయణమహర్షి ఆశ్రమమునకు 1 లక్ష.

**వితరణలు**

1. వివేకానంద యోగా రీసేర్చి సెంటరు చెంగుళూరు పీఠమునకు
2. శ్రీశైల దేవస్థాన అతిథి గృహనిర్మాణమునకు 5 లక్షలు
3. భద్రాచల శ్రీ సీతారామరామచంద్రస్వామి దేవస్థానముకు
4. మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి
5. వేదాద్రి శ్రీ నరసింహస్వామి దేవాలయమునకు, ఇంకా ఎన్నో...

## తెలుగు భాష - సంస్కృతి

# వికాసంపై ప్రభుత్వ అలసత్వం

## ఉగాది పర్వం

**భా**రతదేశంలో వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగుభాషకు ఒక ప్రత్యేకత ఉన్నది. తెలుగు ప్రజల సంస్కృతి, జీవనవిధానంలో విలక్షణత ఉన్నది. సరళమైన తెలుగుభాషకు "తూర్పు ఇటాలియన్ భాష" గా ప్రాచుర్యం ఉన్నది. అతిథులను ఆదరించడంలో తెలుగువారికి వేరెవరూ సాటి రాలేరు.

2000 సంవత్సరాలకు పైగా ఉన్న తెలుగు సాహిత్యానికి విశిష్టత ఉంది. పద్యం తెలుగుభాషకు మాత్రమే ప్రత్యేకం. సహస్రావధానాలు, అష్టావధానాలు తెలుగు సాహిత్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చారు. ప్రపంచ శాస్త్రీయ సంగీత రీతులలో స్థానం పొందగలిగిన కర్ణాటక సంగీతానికి స్పష్టమైన రూపం ఇవ్వటంలో కర్ణాటక సంగీత త్రిమూర్తులలో ఒకరైన త్యాగరాజు తెలుగువాడు. భారతీయ నృత్యరీతులలో కూచిపూడి నాట్యానికి విశేష ప్రఖ్యాతి లభించింది. విలక్షణమైన పేరిణి నృత్యం తెలుగువారిదే. తెలుగు వస్త్రాలకు, వస్త్రధారణకు గుర్తింపు లభించింది. శిల్పం, ఆలయ ఆగమ శాస్త్రం, చిత్రలేఖనం మొదలైన కళలలో తెలుగువారి ప్రావిణ్యం ప్రశంసలు పొందింది. తెలుగు వంటలు, రుచుల గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే తెలుగువారు ప్రాచుర్యం పొందని రంగమే లేదని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్నా తెలుగు భాషా సంస్కృతులకు దక్కవలసిన స్థానం దక్కలేదు. పొరుగింటి పుల్లకూరను నెత్తిన పెట్టుకునే లక్షణం తెలుగువాళ్ళలో ఉన్నంతగా మరేవరిలోనూ ఉండదు. బెంగాలీ సాహిత్యానికి తెలుగునాట బెంగాల్ లో వచ్చినంత ప్రాముఖ్యం వచ్చింది. బెంగాల్ నాయకుడు సుభాష్ చంద్రబోసు కు తెలుగువాళ్ళలో ఎందంరో అభిమానులు ఉన్నారు. కాంగ్రెస్, కమ్యునిస్టు పార్టీలకు ఇక్కడ అభిమానులు ఎందరో. మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూలకు విశేష సంఖ్యలో అభిమానులు ఉన్నారు. కానీ, మన సొంత గుర్తింపు, ముద్ర మాత్రం లేవు. ప్రజల్లో ఉన్న బలహీనతలు ఇందుకు కారణమైనా ప్రభుత్వ పరంగా కూడా తెలుగుభాషా సంస్కృతులపై దృష్టి పెట్టలేదు. వందల సంవత్సరాలు ఇతర ప్రాంతాలలో ఉండడం కూడా ఒక ప్రధాన కారణం. వేలసంవత్సరాల క్రితం శాతవాహనులు, కాకతీయ పాలనలో మాత్రమే తెలుగువారు సొంత పాలనలో ఉన్నారు. విజయనగర సామ్రాజ్యం తెలుగు వైభవానికి ప్రతీకైనా ప్రభుత్వం తెలుగువారిది కాదు. రాజు కృష్ణదేవరాయలకు తెలుగుపై మక్కువ ఉండడం గమనించదగినది.

ఆతర్వాత అనేక పాలనలలో తెలుగువారు ఉన్నారు. పరాయి పాలన ఉన్నందున తెలుగువారు ద్వితీయ శ్రేణి పౌరులే. దేశాన్ని చాలా కాలం పాలించిన బ్రిటిష్ ప్రభుత్వంలో తెలుగువారు మద్రాసు రాష్ట్రంలోనూ, నిజాం రాష్ట్రంలోనూ ఉండేవారు. తెలుగుకు లభించవలసిన ప్రాముఖ్యం ఇక్కడ లభించలేదు. తెలుగువారికి సొంత రాష్ట్రం ఉండాలనే కోరిక స్వాతంత్రం వచ్చిన తర్వాత 1953 లో నెరవేరింది. ఆతర్వాత మూడేళ్ళలో తెలుగువారందరినీ ఏకం చేస్తూ భాషాప్రయుక్త రాష్ట్రాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ అవతరించింది. సొంత పాలనలో కూడా తెలుగుభాషా సంస్కృతుల వికసంపై శ్రద్ధ వహించలేదు.

1969 లో ప్రత్యక తెలంగాణా ఉద్యమం రాజకీయంగా ప్రారంభమైనప్పుడు కొంతవరకు తెలుగుభాష సంస్కృతులపై ఆలోచన వచ్చింది. 1975 లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు తెలుగుభాషా సంస్కృతుల పరిరక్షణపై ఆలోచించే అవకాశం ఇచ్చింది. ఎన్నో సంవత్సరాల తర్వాత "మాతెలుగు తల్లికి మల్లెపూదండ" పాట తిరిగి ప్రాచుర్యంలోకి వచ్చింది. కళాశాల స్థాయిలో కూడా తెలుగులో విద్యబోధనపై దృష్టి సారించారు. పరిపాలన తెలుగులో సాగే విధంగా చర్యలు ప్రారంభమైయ్యాయి. అధికార భాషా సంఘం ప్రారంభమైనది. రాజకీయపరిణామల కారణంగా ఈ కృషి కొంత వెనుకబడింది.

1982 లో ప్రముఖ నటుడు యన్.టి. రామారావు తెలుగుదేశం పార్టీ ప్రారంభించి నప్పుడు "తెలుగు ఆత్మ గౌరవం" నినాదం ప్రభంజనం సృష్టించింది. తెలుగుదేశం ఎన్నికల ప్రచారంలో "మా తెలుగుతల్లికి మల్లెపూదండ" "చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా" పాటను ప్రజలను అత్యుత్సాహపరిచాయి.




తెలుగు ఆత్మగౌరవ నినాదంతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశంపార్టీ అధినేత ఎన్.టి. రామారావు స్వయంగా కళాకారుడు కావడంతో తెలుగు వైభవం వెలిగిపోతుందనే ఆశలు ఫలించలేదు.

ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత హైదరాబాద్ లో తెలుగు చిత్ర పరిశ్రమ అభివ ృద్ధి వేగవంతమయ్యింది. ఆంధ్ర ప్రాంతీయులు ముఖ్యంగా కోస్తా జిల్లాల ప్రజలు రాజధాని నగరంపై పెట్టుబడుల ప్రవాహం కురిపించారు. కాని, తెలుగు భాషా సంస్కృతులకు జరిగిందేమీ లేదు.

మరికొద్ది సంవత్సరాల తర్వాత ఎన్. టి. ఆర్ అల్లుడు చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఏర్పడిన తెలుగుదేశ ప్రభుత్వం ఐటి సమాచార సాంకేతిక విజ్ఞానం పేరిట ఆంగ్ల భాషకు అత్యధిక ప్రముఖ్యమిస్తూ తెలుగును నిర్లక్ష్యం చేసింది. మెరుగైన ఉద్యగావకశాలకోసం ఆంగ్ల భాషకు ప్రాముఖ్యత పెరిగింది.


ప్రభుత్వ వైఖరి ఇలా ఉండగా సినిమా, టీవి రంగాలు, మీడియా కూడా తెలుగుభాషా సంస్కృతులపై పెద్దగా ఆసక్తి చూపలేదు. మాతృభాషలో ప్రావిణ్యం ఇతర భాషలలో ప్రావిణ్యం సంపాదించడానికి దోహదపడుతుందనే శాస్త్రీయ సూత్రాన్ని పట్టించుకోలేదు.

ఐతే ఉద్యోగావకశాలకోసం విదేశాలకు- ఎక్కువగా అమెరికా, బ్రిటన్ లకు వెళ్ళిన తెలుగువారు ఆయా దేశాలలో మాతృ భాషపైన, దేశ సంస్కృతిపైన అక్కడి ప్రజలు విశేష ప్రాముఖ్యం ఇవ్వడం చూసి ప్రభావితులయ్యారు. తెలుగుభాషా సంస్కృతులపై విశేష అభిమానం చూపారు. ఒకవిధంగా చెప్పాలంటే తెలుగుభాషా సంస్కృతులపై విదేశాలలో స్థిరపడిన తెలుగువారి ఆసక్తి ఇక్కడ తెలుగు ప్రజలపై ప్రభావం చూపింది.

2000 సంవత్సరం తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణా ప్రాంతంలో కే. చంద్రశేఖర్ రావు ప్రారంభించిన తెలంగాణా ఉద్యమం రాజకీయ అస్థిర పరిస్టితులను సృష్టించింది. ఉద్యమానికి నాయకత్వం వహించిన చంద్రశేఖర్ రావు స్వయంగా సాహితీవేత్త కావడంతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి భాష అడ్డురాకూడదని తెలంగాణా యాసకు ప్రాముఖ్యం ఇచ్చి యాసకు భాషా స్థాయి కల్పించడంలో సఫలీకృతులయ్యారు. అంతటితో ఆగక తెలంగాణాది వేరే సంస్కృతి అని చెప్పడానికి తెలంగాణా పల్లె ప్రాంతాలలోని జానపద పండుగ బతుకమ్మకు విశేష ప్రాముఖ్యం కల్పించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా చీలి 13 జిల్లాలతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బలారిష్టాలతో, ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ తెలుగు భాషా సంస్కృతులకు ప్రాముఖ్యం ఇవ్వలేకపోయింది. రాజకీయాలకు మాత్రమే విశేష ప్రముఖ్యమిచ్చే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు భాషా సంస్కృతులపై ఆసక్తి, అవగాహన లేవు. ప్రజలను కలిపి ఉంచడంలో భాషా సంస్కృతుల ప్రభావాన్ని ఆయన గమనించలేదు. ఈ రంగంతో సంబంధం ఉందని భావించే తన అనునాయులకు ప్రయోజనం కల్పించడం భాషా సంస్కృతులపై చంద్రబాబు అభిమానం - ప్రోత్సాహం. ఉగాది ఉత్సవం, పురస్కారాలు, పంచాంగ శ్రవణం, మాతృభాషా దినోత్సవం వంటి కార్యక్రమాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. తెలుగు ప్రాధికారిక సంస్థ ఏర్పాటు వంటి చర్యలు ఆ కోవలోనివే. ఎన్నికలలో ప్రయోజనం రావచ్చనే ఉద్దేశమే ఇటీవల తిరిగి ప్రారంభమైన సాహిత్య అకాడమి, సంగీత అకాడమీ, నాటక అకాడమి వంటివి. రాజధాని నగరానికి దగ్గరలో ఉన్న కూచిపూడి కూచిపూడి నృత్యానికి పుట్టినిల్లు కావడం ప్రభుత్వ ప్రోత్సాహం పొందడానికి ఒక కారణం.ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజు తెలుగువాడే. ప్రస్తుత ప్రకాశం జిల్లా కాకర్ల గ్రామం త్యాగరాజు పూర్వీకుల స్వస్థలం. అయినా త్యాగరాజుకు స్వరాష్ట్రంలో తగిన గౌరవం లభించలేదు. తమిళనాడుతో సహా ప్రపంచంలో పలు దేశాల నీరాజనాలు అందుకుంటున్న త్యాగరాజుకు స్వరాష్ట్రంలో తగిన గుర్తింపు లేదు. 2 సంవత్సరాల క్రితం దేశంలోని వివిధ రాష్ట్రాలలో, అనేక దేశాలలో త్యాగరాజు 250 వ జయంతి వేడుకలు వైభవంగా జరుగగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం దూరంగా ఉన్నది. తమిళనాడులో త్యాగరాజు వర్ధంతి ఏటా జరుగుతున్నది. త్యాగరాజు జయంతిని(మే-4) జరిపితే బాగుంటుందని పలువురు చేసిన విజ్ఞప్తిని ముఖ్యమంత్రి పట్టించుకోలేదు. రాష్ట్రం విడిపోయిన తర్వాత తెలుగు సాంస్కృతిక సంస్థలు హైదరాబాద్ లోనే ఉండిపోయాయి. మీడియా సంస్థలన్నింటికి హైదరాబాద్ ముఖ్య కేంద్రం. ఇటువంటి సంస్థలను కొత్త రాష్ట్రంలో ఏర్పాటు చేయడంపై ప్రభుత్వంలో ఎటువంటి ఆలోచన ఉన్నట్లు కనబడదు. ఒక జాతికి గుర్తింపు రావడంలో భాష, సంస్కృతీ ప్రముఖ పాత్ర వహించగలదని పాలకులు గుర్తించి తగు చర్యలు తీసుకుంటే బాగుంటుంది. భాషా సంస్కృతుల వికాసం కేవలం ప్రభుత్వానికి సంబంధించినది మాత్రమే కాదు తమ ఉనికిని, ప్రత్యేకతను చాటుకోనడానికి ప్రజలకు భాషా సంస్కృతుల వికాసం అవసరం. సినిమా, టీవీ రంగాలు స్వయంగా అభివృద్ధి చెందుతున్న విషయం తెలిసిందే. కనుక ప్రభుత్వం పై పూర్తిగా ఆధారపడకుండా భాషా సంస్కృతుల వికాసానికి అభిమానం ఉన్నవారు కృషి చేస్తే బాగుంటుంది. మొన్నమొన్నటివరకు దేశంలో హిందీ తర్వాత ఎక్కువమంది ప్రజలు మాట్లాడే భాష తెలుగు. పది కొట్లమందికిపైగా తెలుగుమాట్లడేవాళ్ళు ఉన్నారు. మరాఠీ, బెంగాలీ భాషల ప్రజల చొరవతో ఇప్పుడు తెలుగు హిందీ తర్వాత మాట్లాడే భాషలలో తెలుగు మూడో స్థానానికి దిగజారింది. తెలుగు భాషాభిమానులు ఈ విషయాన్ని గుర్తించి తెలుగు వైభవ పునరుద్ధరణకు కృషి చేస్తే బాగుంటుంది.


**- కె. పాండురంగారావు**



దేశభాషలందు తెలుగు లెస్స




తెలుగు ప్రభుత్వాల నిరాధరణ



కూచిపూడి నాట్య సృష్టికర్త

# ఎన్నికల సిత్రాలు






**నారా లోకేశ్ ఇస్త్రీ ,అచ్చన్న హెయిర్ కటింగ్**

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్ల మనసుల్ని గెలిచేందుకు అభ్యర్థులు, కార్యకర్తలు తెగ కష్టపడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి దాకా ప్రచార కార్యక్రమాలతో చెమటోడుస్తున్నారు.గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్ల ఇళ్లకు వెళ్లి తలుపుతడుతున్నారు. వారిని ప్రసన్నంచేసుకునేందుకు మునుపెన్నడూ ముట్టుకోని పనులను కూడా ఇప్పుడు ఎంచక్కా చేసేస్తున్నారు. అన్ని పార్టీల అభ్యర్థులు చిత్రవిచిత్రమైన పనులతో ఆకట్టుకుంటున్నారు. అలాంటి కొన్ని పాటోలు చూద్దాం.













## బీజేపీ, కాంగ్రెస్

# 'చీరల యుద్ధం'



**లోక్‌సభ ఎన్నికల్లో మొదటి విడత పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. దీంతో పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతివిమర్శలు, పోటాపోటీగా హామీలు మామూలైపోయాయి. అయితే ఈ ఎన్నికల సీజన్‌ను క్యాష్ చేసుకుంటున్నారు వ్యాపారులు. రాజకీయ నాయకుల బొమ్మలతో పోటాపోటీగా చీరలు తయారు చేసి మార్కెట్లోకి దించుతున్నారు. ఆ ఫోటోలు చూడండి.**








## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా చంద్రబాబు కే సాధ్యం



మంగళగిరి లో జరిగిన నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మద్దిరాల జోసెఫ్ ఇమ్మాన్యేల్

**రాజధాని వార్తలు, విజయవాడ :** దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న దళిత క్రిస్టియన్‌లకు ఎస్సీ హోదా సమస్య పై పార్లమెంటు లో పోరాడి సాధించే ధైర్యం ఒక్క చంద్రబాబు నాయుడి కే ఉందని మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్ ఎం.జోసఫ్ ఇమ్మా ను యేల్ అన్నారు. ఈమేరకు జరిగిన సమావేశంలో ఇంకా నామినేటెడ్ ఎమ్మెల్యే ఫిలిప్ థోచర్, ప్రముఖ నటి దివ్య వాణి, పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ విగ్రహం వద్ద
## చంద్రబాబు నిరసన



**రాజధాని వార్తలు, అమరావతి :** ఏపీ హక్కులను కాలరాశారని నిలదీసినందుకే రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతలపై ఐటీ దాడులు చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. టీడీపీని నిర్వీర్యం చేయడం ద్వారా ఏపీకి నష్టం చేయడంపై శుక్రవారం టీడీపీ నేతలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా చంద్రబాబు విజయవాడలోని తమ్మలపల్లి కళాక్షేత్రం, అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలతో నిరసన చేపట్టారు. ప్రదాని మోడీ రాష్ట్ర అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా, ఎదురుదాడి చేస్తూ తెలుగు జాతిని నిర్వీర్యం చేసే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే ఏపీ ప్రతిపక్ష నేత జగన్ బీజేపీకి మద్దతు ఇస్తున్నారని, ఈ విషయం స్వయంగా పీయూష్ గోయల్ చెప్పారని చంద్రబాబు అన్నారు. జగన్ ఒక పథకం ప్రకారం లోటస్ పాండ్‌లో ఉండి కుట్రలు, కుతంత్రాలకు ప్లాన్ చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. మోడీకి పతనం ప్రారంభమైందని, అందుకే రాక్షసపాలనకు మోదీ శ్రీకారం చుట్టారని, దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని, ప్రశ్నిస్తున్న వారిపై ఐటీ దాడులు చేయిస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీని చరిత్ర హీనుడిగా నిలబెడతామని చంద్రబాబు హెచ్చరించారు. బీజేపీ అగ్రనేత అద్వానీ చెప్పిన దానికి ప్రధాని మోడీ పూర్తిగా వ్యతిరేకమని చంద్రబాబు విమర్శించారు. దేశాన్ని నాశనం చేయాలని ఆయన కంకణం కట్టుకున్నారని, అధికారం ఉంటే మోడీ ఎలాంటి దారుణాలైనా చేస్తాడని ఆరోపించారు. ఇలాంటి దుర్మార్గుడికి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలని చంద్రబాబు పిలుపు ఇచ్చారు. ఖబడ్దార్..ఏకపక్షంగా దాడులు చేస్తే ఊరుకునేది లేదని చంద్రబాబు హెచ్చరించారు.

## కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

### జాయింట్ కలెక్టర్ కృతికాశుక్లా



**రాజధాని వార్తలు, విజయవాడ :** కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ముందస్తు ఏర్పాట్లతో సిద్ధం కావాలని విజయవాడ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గంగూరు ధనేకుల ఇన్సిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అంట్ టెక్నాలజీ కళాశాలలో మే 23వ తేదీన చేపట్టనున్న కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను జేసీ, డీసీపీ హర్షవర్ధన్‌తో కలిసి పరిశీలించారు. ఈ నెల 11వ తేదీన జరిగే పోలింగ్ అనంతరం విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం, నియోజకవర్గ పరిధిలోని విజయవాడ తూర్పు పశ్చిమ, సెంట్రల్, నందిగామ, మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు మే 23న గంగూరు ధనేకుల ఇన్సిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా కంట్రోల్ యూనిట్లను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తామని, ఇందుకు సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కళాశాలలో అగ్నిమాపక నిరోధక సాధనాలను ఏర్పాటు చేయాలని, సరిహద్దు దారులను మూసివేసి ప్రధాన ద్వారాన్ని మాత్రమే తెరిచి ఉంచాలని పేర్కొన్నారు. పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు, సీసీ కెమెరాలను స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలు, కళాశాలలో అన్ని వైపుల ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. జాతీయ రహదారి అప్రోచ్ రోడ్డు నుంచి ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల వరకు రూ.6.50 లక్షల నిధులతో ఆర్‌అండ్‌బి రహదారిని పటిష్ట పరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కళాశాల వరకు రహదారి వెంబడి వీధి దీపాలను తక్షణమే అమర్చాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఏర్పాట్ల పరిశీలనలో సహాయ రిటర్నింగ్ అధికారి కేడీవీఎం ప్రసాద్‌బాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## విజేత లెవరు?

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యంగా చావో ...రేవో తేల్చుకునేందుకు విస్తృతస్థాయిలో పర్యటిస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే నవ రత్నాలు అమలు చేస్తామని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని మరిపించే విధంగా సంక్షేమ పాలన అందిస్తానని చంద్రబాబుకి మించి వాగ్ధానాల వర్షం కురిపిస్తున్నారు. రాష్ట్రాన్ని అవినీతికి కేరాఫ్‌గా మార్చి చంద్రబాబు లక్షల కోట్లు దోపిడీ చేశారని, రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, గత ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసగించారని జగన్ కుటుంబసభ్యులు తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పిస్తున్నారు.

ఇక జనసేన, లెఫ్ట్ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ పవన్ కళ్యాణ్, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధులు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. గత ఐదేళ్ళలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన అవినీతి కార్యక్రమాలు, కార్పొరేట్‌శక్తులకు ఊడిగం చేసిన విధానాలను వివరిస్తున్నారు. కూటమిలోని బీఎస్పీ అధినేత మాయావతి విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో నిర్వహించిన బహిరంగసభలకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఏది ఏమైనా విజయం ఎవరిని వరిస్తుందో తెలుసుకోవాలంటే మే 23 వరకు ఆగాల్సిందే.


ఉగాది శుభాకాంక్షలు
కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్
కె.కుమార్‌రాజా,కోశాధికారి, కె. మోహనరావు కార్యవర్గసభ్యులు
నూతక్కిగ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా,
సెల్ : 9182155644





* పేద విద్యార్థులకు చేయూత
* క్రీడారంగానికి ప్రోత్సాహం
* సామాజిక చైతన్యం కలిగించే కార్యక్రమాలు
వ్యవస్థాపక అధ్యక్షులు :
చికాపల్లి రమేష్
కలిసి రండి ! మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం!!





శ్రీ వికారి నామ ఉగాది శుభాకాంక్షలు





ప్రెగడ ఆదిసుదర్శన సుందరరావు
కస్టమర్ సర్వీస్ ప్రధాన లక్ష్యంగా, స్థాపించబడిన...
అరుణోదయ హెచ్.పి. గ్యాస్ ఏజన్సీ
హుస్సేన్ కట్ట వద్ద, పాత మంగళగిరి,
ఫోన్ : 08645-233244, 235566 సెల్ : 9848111905
న్యూ కనెక్షన్ పై 5%-10% వరకు డిస్కౌంట్ ఇవ్వబడును
మంగళగిరి మండలంలో
ఏ ప్రాంతానికైన డోర్ డెలివరి సౌకర్యం కలదు
న్యూ కనెక్షన్స్, దీపం కనెక్షన్స్ మరియు దీపం కనెక్షన్ వారికి 2వ సిలిండర్ వెంటనే ఇవ్వబడును.
కావలసినవారు సంప్రదించగలరు.







ప్రెగడ అజయ్



ఉగాది శుభాకాంక్షలు
పొట్లాబత్తుని వారి
లక్ష్మీ శారీస్







పొట్లాబత్తుని లక్ష్మణరావు
తెలుగు రాష్ట్రాలలో అనేక ప్రాంతాలలో తయారైన పట్టు చీరలు మగువలు మెచ్చే అన్ని రకముల చేనేతలు లభించును.





పొట్లాబత్తుని శ్రీకాంత్
మా సొంత మగ్గములపై తయారు చేయించిన పట్టు చీరలు, కాటన్ చీరలు, డ్రస్‌మెటీరియల్స్ పోచంపల్లి, ఉప్పాడ వివిధ ప్రాంతాల నాణ్యమైన పట్టుచీరలు
హోల్‌సేల్ ధరలకు లభించును







ఉగాది శుభాకాంక్షలు





ప్రొ॥ కె.వెంకట సీతారామారావు
(తాళ్లకొట్టు రాము)
08645-232568
232768
శివ శంకరరావు సన్
మొ॥గు అన్ని రకములు సరసమైన ధరలకు లభించును.
మా వద్ద అన్ని రకముల
* నవారు
* తాళ్ళు
* మంచం పట్టాలు
* మ్యాస్టిక్ ప్యాడ్స్
* టాపీలు
* బొచ్చెలు
* ప్లాస్టిక్ పట్టాలు
* పారలు
* ప్లాస్టిక్ దోమతెరలు
మెయిన్ బజార్, మంగళగిరి-522 503

# ప్రజలు ఏం చూసి ఓటు వేస్తారు..?

## పార్టీనా, ముఖ్యమంత్రి అభ్యర్థినా లేక స్థానిక అభ్యర్థినా?

**ప్రజాస్వామ్యంలో ప్రజల ఓట్లే పాలకులను ఎన్నుకుంటాయి.ఎన్నికల్లో ఓటు వేసేటపుడు రాజకీయ పార్టీ కన్నా, ముఖ్యమంత్రి అభ్యర్థి కన్నా, స్థానిక అభ్యర్థి ఎవరన్నదే ఓటర్లకు ముఖ్యమని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ సర్వే చెప్తోంది. ఓట్ల కొనుగోలు కోసం పంచే నగదు, బహుమతులకు అతి తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆ సర్వేలో వెల్లడైంది.**



అత్యధిక శాతం ఓటర్లు తాము ఓటు వెయ్యడానికి ముఖ్య కారణం.. స్థానికంగా పోటీచేస్తున్న అభ్యర్థి ఎవరు అన్నదేనని చెప్పారు (ముఖ్య కారణం: 64% మంది, చాలా ముఖ్యం: 14% మంది).రెండోది ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు అనేది చూస్తామని చెప్పారు (ముఖ్య కారణం: 35% మంది, చాలా ముఖ్యం: 42% మంది).మూడోది అభ్యర్థులు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ అని చెప్పారు (ముఖ్య కారణం: 40% మంది, చాలా ముఖ్యం: 31% మంది).

ఇక ఒక అభ్యర్థికి ఓటు వెయ్యడంలో 16 % ఓటర్లకు నగదు పంపిణీ, మద్యం, బహుమతులు మొదలైనవి కారణాలుగా (ముఖ్య కారణం 9 % మంది, చాలా ముఖ్యం 7 % మంది) ఉన్నాయి.ఎన్నికల్లో ఏ అభ్యర్థి కి ఓటు వెయ్యాలి అన్న నిర్ణయం తీసుకోవడంలో 84% మంది ఆంధ్రప్రదేశ్ ఓటర్లు తమ సొంత అభిప్రాయం ముఖ్యం అని ఏడీఆర్ సర్వేలో చెప్పారు.ఆ తరువాత కుటుంబ సభ్యుల అభిప్రాయానికి ప్రాధాన్యత ఇచ్చేవారు 7 శాతం మంది ఉన్నారు. ఇక తమ జీవిత భాగస్వామి అభిప్రాయాన్ని గౌరవించి వారు చెప్పినట్లు ఓటు వేసే వారు 6 శాతంగా ఉన్నారని సర్వేలో వెల్లడైంది.

### క్రిమినల్ కేసులున్నా ఎందుకు ఓట్లేస్తున్నారు

ఇక ఎన్నికలలో పోటీ చేస్తున్న వారిలో క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులకు సంబంధించి ఓటర్ల అభిప్రాయాన్ని అర్థం చేసుకోవటానికి కూడా ఏడీఆర్ ప్రయత్నించింది."క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులు పార్లమెంటు, అసెంబ్లీల్లో ఉండవచ్చా" అని అడిగిన ప్రశ్నకు.. 98 % మంది ఓటర్లు నేర నేపథ్యం ఉన్న అభ్యర్థులు చట్టసభల్లో ఉండకూడదు అని చెప్పారు.నేర నేపథ్యం ఉన్న అభ్యర్థులకు ఎందుకు ఓటు వేస్తారు అని అడిగినపుడు.. 37% మంది ఓటర్లు సదరు అభ్యర్థి వేరే మంచి పనులు చేసినందుకు అని అభిప్రాయపడ్డారు. నేర నేపథ్యం ఉన్న అభ్యర్థులకు ఓటు వెయ్యడంలో కుల, మతపరమైన అంశాలు కూడా కీలకమని 36 % మంది ఓటర్లు చెప్పారు.నేర నేపథ్యం ఉన్న అభ్యర్థులకు ఓటు వెయ్యడానికి మరో కారణం వారి మీద ఉన్న కేసులు తీవ్రమైనవి కాకపోవడమని, మరో 36 % మంది ఓటర్లు స్పందించారు.వారి నేర నేపథ్యం గురించి సమాచారం లేకపోవడం కూడా కారణమని,మరొక కారణంగా ఇంకో 36 % మంది పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నేర చరిత్ర సమాచారం పొందగలరని మీకు తెలుసా" అని అడిగినపుడు.. కేవలం 35 % ఓటర్లకు మాత్రమే అభ్యర్థుల క్రిమినల్ రికార్డుల సమాచారాన్ని పొందవచ్చని తెలుసునని చెప్పారు.

### డబ్బు పంపిణీపై జనం ఏమంటున్నారు?

ఎన్నికల్లో డబ్బు పాత్ర గురించి ఓటరు అవగాహనను అంచనా వేయడానికి కూడా ఏడీఆర్ ప్రయత్నించింది.

ఓటర్లలో అంటే 73% మందికి ఎన్నికల్లో నగదు పంపిణీ, బహుమతులు ఇవ్వటం వంటివి చట్టవిరుద్ధం అని తెలుసని ఏడీఆర్ సర్వేలో వెల్లడైంది.గత ఎన్నికల సమయంలో నగదు/డబ్బు పంపిణీ/మద్యం పంపిణీ గురించి మీకు అవగాహనా ఉన్నదా? అని ఏడీఆర్ ప్రశ్నించగా, 38 % మంది ఓటర్లు ఎన్నికల్లో నగదు, బహుమతులు తదితరాలను ఓటర్లకు పంచిన సందర్భాలు తెలుసునని బదులిచ్చారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ అస్టేరిస్క్ కంప్యూటింగ్ అండ్ డేటా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తో కలిసి 2018 అక్టోబర్ - డిసెంబర్ మధ్య కాలంలో దేశవ్యాప్తంగా ఈ ఓటరు సర్వే నిర్వహించినట్లు వెల్లడించింది."ఈ సర్వే ని ఉత్తమమైన శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి నిర్వహించడం జరిగింది" అని చెప్పింది. జనాభాలో గ్రామీణ - పట్టణ నివాసం, లింగం, కులం, మతం, ఆదాయ వర్గాల వారీగా తగిన ప్రాతినిధ్యం ఉండే విధంగా 18 సంవత్సరాల వయసు నిండిన వాళ్ళను ఈ సర్వే కోసం ఎంపిక చేసినట్లు తెలిపింది.సర్వే లో పాల్గొన్న వారిలో 61 % మంది గ్రామీణ ప్రాంతాల నుండి, 39 % పట్టణ ప్రాంతాల నుండి ఉన్నారనిబీ 62 % మంది పురుషులు, 38 % మంది మహిళలు 72 % మంది జనరల్, 7 % ఓబీసీ, 16 % ఎస్సీ, 5% ఎస్టీ వర్గాల ప్రజలు ఉన్నారని చెప్పింది.సర్వే నిష్పాక్షికంగా ఉండేలా ప్రతి జాగ్రత్త తీసుకున్నామని, సర్వే కచ్చితత్వం 95 శాతమని పేర్కొంది.

- బీబీసీ సౌజన్యంతో..

## చిన్నోడు చురుకైనోడే



**రాజధాని వార్తలు :** సాధారణంగా ఇంట్లో పెద్ద సంతానం కన్నా చిన్నోళ్లు చురుగ్గా వుంటాడని అంటుంటారు. ఇప్పుడు బాలయ్య ఫ్యామిలీలో కూడా అదే రిపీట్ అవుతోందని విశాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. బాలయ్య పెద్దఅల్లుడు నారాలోకేష్ కన్నా, చిన్నఅల్లుడు శ్రీభరత్ చాలా హుషారు, తెలివైనవాడు అంటున్నారు విశాఖ వాసులు. పాతికేళ్లున్న ఈ కుర్రాడు చంద్రబాబును, లోకేష్ ను వంచి మరీ విశాఖ ఎంపీ టికెట్ తెచ్చుకున్నారు. అప్పుడు బాలయ్య పట్టుపట్టి వుంటారులే అనుకున్నారు అంతా.కానీ టికెట్ వచ్చిన కొద్ది రోజుల్లోనే శ్రీభరత్ ప్రచారం, పార్టీ జనాలను దగ్గరకు చేర్చుకున్నవైనం, వాళ్లను మొత్తానికి తనముందు లైన్లో నిల్చోపెట్టుకున్న సంగతి చూసి, చిన్నఅల్లుడు ఎప్పటికీ చిన్నఅల్లుడేనని దేశం వర్గాలు చమత్కరిస్తున్నాయి.

తను ఎంపీగా వెళ్లడం తప్పించుకోవడం కోసం గంటా శ్రీనివాసరావు, కిందామీదా పడి శ్రీభరత్ కు టికెట్ రావడలో తనవంతు పాత్ర పోషించారు. కానీ ఇప్పుడు భరత్ వ్యవహారశైలి, పార్టీ జనాలను మేనేజ్ చేస్తున్న తీరు, పార్టీపై తీసుకుంటున్న పట్టుచూసి భరత్ గెలిస్తే, ఇక విశాఖ తెలుగుదేశంపై తనపట్టు తగ్గిపోతుందని గంటా టెన్షన్ పడుతున్నట్లు పార్టీ కార్యకర్తల్లో వినిపిస్తోంది. మొత్తంమీద తెలుగుదేశం పార్టీలో మరోసారి 'చిన్న అల్లుడు'- 'పెద్ద అల్లుడు' అంశం డిస్కషన్ గా మారుతోంది. మళ్లీ చరిత్ర పునరావృతం అవుతుందా? చంద్రబాబు వుండగా సాధ్యంకాదనే అనుకోవాలి.

## గులాబీ నోట్లెక్కడ ?

**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో ఎక్కడా గులాబీ రంగునోట్లు కనిపించడం లేదు. అన్ని చోట్ల నుంచి తక్కువ విలువ గల నోట్లే వస్తున్నాయికాని, రూ.2000 నోటు మాత్రం కానరావడం లేదు.. ఎంత పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసినప్పటికీ ఇదే పరిస్థితి. ఉద్యోగుల జీతాలకు కూడా 100, 200 వస్తున్నాయి కాని పెద్ద నోట్లు రావడం లేదు. ఎన్నికల అనంతరం మాత్రమే పరిస్థితిలో మార్పు వస్తుందని బ్యాంకర్లు చెబుతున్నారు. నెలలో మొదటి వారం కావడంతో చాలా మంది ఉద్యోగులు, వ్యాపారస్తులు ఏటీఎంల వద్ద బారులు తీరారు. ఎంత పెద్దమొత్తంలో డ్రా చేసినా చిన్న నోట్లు రావడంతో పర్సుల్లో పట్టక వినియోగదారులు అవస్తలు పడుతున్నారు. అయితే ఏటీఎంలను ఖాళీగా ఉంచకుండా చిన్న నోట్లతో అయినా నింపినందుకు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పెద్దనోట్ల రద్దు సమయంలో ఏటీఎంల వద్ద పడిన బాధ ఎవ్వరూ మరచి పోలేదని తెలుస్తోంది. గులాబీ రంగు నోటు కనిపించకపోవడానికి కారణం ఆరునెలల నుంచి రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.2000నోట్ల సరఫరాను నిలిపి వేయడమే కారణం కాగ, కస్టమర్లు కూడా రూ.2000 నోట్లను తిరిగి ఇవ్వడం లేదని బ్యాంకులు చెబుతున్నాయి. అయితే ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు రూ.2000 నోట్లను రాజకీయపార్టీలు తమ దగ్గర ఉంచుకున్నాయన్న వార్తలున్నాయి. విజయవాడలో రోజుకు రూ. 2 కోట్ల నుంచి రూ. 8 కోట్ల వరకు బ్యాంకులు, ఏటీఎంల నుంచి బయటికి వస్తుందని, విజయవాడ పరిసర గ్రామాల్లో మరో రూ. 2 కోట్లు సర్క్యులేట్ అవుతాయని, బ్యాంకు చెస్టుల నుంచి రూ. 3-4 కోట్లు పంపిణి చేస్తున్నామని బ్యాంకు ఉద్యోగి ఒకరు చెప్పారు. అయితే బ్యాంకుల్లోనే రూ. 2000 నోట్లు లేకపోవడంతో ఏటీఎంల్లో ఇవి కనిపించడం లేదంటున్నారు. నగరంలోని ఏబీసీ కేటగిరీలకు చెందిన బ్యాంకుల్లో 361 చెస్ట్‌లున్నాయని ఒక్కోదానిలో రూ.200 నుంచి 1000 కోట్ల నోట్ల సామర్థ్యం ఉంటుందన్నారు. ఏ కేటగిరి బ్యాంకులు రోజుకు 150 కోట్లు చెలామణి చేయగలవని పేర్కొన్నారు.

# ప్రచారంలో కొత్త పోకడలు

**ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రోడ్ షోలు, ర్యాలీలు చేపట్టి తాము ఏం చేస్తామో వివరిస్తారు.. లేదంటే తమ పార్టీ విధివిధానాలను ఏకరువు పెట్టి ఓట్లు అభ్యర్థిస్తారు. అయితే విజయవాడ వైసీపీ లోక్‌సభ అభ్యర్థి పొట్లూరి వర ప్రసాద్ మాత్రం అందుకు భిన్నంగా నగరంలో ప్రచారం చేస్తున్నారు.ఉదయాన్నే కాలినడకన అన్ని వాడల్లో పర్యటిస్తూ, చంద్రబాబు చెప్పిన అభివృద్ధి ఏమేరకు వుంది అని వారినే అడిగి తెలుసుకుంటున్నానన్నారు. ప్రజలే సమస్యలను ఏకరవు పెడుతున్నారన్నారు. ఇక ఉత్తర విశాఖ అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో ఉన్నా గంట శ్రీనివాసరావు మాత్రం ఓట్ల కొల్లొగొట్టేందుకు రోడ్‌షోలు, ప్రచారాలు మానేసి వార్డుల వారీగా నేతలను పిలిచి మీటింగులు పెడుతూ వారితోనే మొత్తం కథ నడిపిస్తున్నారు.**





**రాజధాని వార్తలు :** డ్రయినేజీలు సరిగ్గాలేక, ఇళ్లలోకి మురికినీరు ప్రవేశించి నానాపాట్లు పడుతున్నామని, తాగునీరు వసతి లేదని ఇలా సమస్యలను స్థానికుల నుంచే రాబడుతున్నారు. దీంతో మరి ఇంకేం బెజవాడ అభివృద్ధి అని ఆయన ప్రశ్నిస్తున్నారు. విజయవాడ అభివృద్ధి అంటే అందాలు మాత్రమే కాదని, మౌలిక సదుపాయాలు ముఖ్యమని పీవీపీ చెబుతున్నారు. విజయవాడ ఎంపీ సీటును, దాని పరిధిలోని ఎమ్మెల్యే సీట్లను స్వీప్ చేస్తామని ఆయన ధీమా వ్యక్తంచేసారు. ఈ ధీమాకు కారణం తనదికాదని, జనానికి రాజశేఖర రెడ్డి మీద, జగన్ మీద వున్న అభిమానం, దేవుడి కృప అని ఆయన అన్నారు. ప్రజలు మరేవీ ఆలోచించకుండా, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, పార్టీ కోసం పనిచేయడం చూస్తుంటే ఆనందంగా, ఆశ్చర్యంగా వుందని ఆయన అన్నారు. జనాలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని, అధికార పార్టీ ఎన్ని పథకాలు ఆఖరి నిమిషంలో ప్రవేశపెట్టినా లాభంలేదని ఆయన ఘంటాపథంగా చెబుతున్నారు.

### గంటా యాక్షన్ ప్లాన్..

ఇప్పటికీ ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగేందుకు సీనియర్ నేతలు అనేకమంది మొగ్గు చూపుతూండగా మంత్రిగా కాంగ్రెస్, టీడీపీలో పనిచేసిన బడా నేత గంట శ్రీనివాసరావు మాత్రం ఓట్ల కొల్లొగొట్టేందుకు దగ్గర దారి కనిపెట్టారు. లక్షలాది మంది జనాలకు కలవడం టైం వేస్ట్ ప్రోగ్రాం అనుకున్నారో ఏమో కానీ, కాలు కదపకుండా ప్రచారం చేసుకునేందుకు ప్లాన్ చేసుకున్నారు. వార్డుల వారీగా నేతలను పిలిచి మీటింగులు పెడుతున్నారు. వారితోనే మొత్తం కథ నడిపిస్తున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం కొండవాలు ప్రాంతాలతో పాటు, మధ్యతరగతి ప్రజలు కూడా ఎక్కువగా ఉన్న అసెంబ్లీ సీటు ఇది. ఇక కారు కూడా దూరని ప్రాంతాలు అనేకం ఉన్నాయి. గంటా ఓట్లు అడగాలంటే కొండలు కూడా ఎక్కాల్సివుంటుంది. ఈ బాధ అంతా ఎందుకు అనుకున్నారో ఏమో కానీ మంత్రి గారు తన వద్దకే నేతలను రప్పించుకుని వారితోనే మంతనాలు జరుగుతున్నారట. ఎక్కడ లేని హామీలు, వరాలు అన్నీ వారికే ఇస్తూ వారి ద్వారానే ఓటు పట్టేయాలనుకుంటున్నారట.

దీంతో ఉత్తర నియోజకవర్గంలో ఆ మాత్రం పేరున్న చోట నేత అయితే చాలు మంత్రి గారి కటాక్షం లభిస్తోంది ఇపుడు. వారిని అందరినీ ఒక చోటుకు చేర్చడం తాను చేయాల్సింది చేసేసి గుట్టు చప్పుడు కాకుండా మంత్రి గారి అనుచరులు పంపించేస్తున్నారట. ఇక కుల సంఘాల నాయకులకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఉత్తరంలో ఎన్నెన్ని కులాలు ఉన్నాయో లెక్కలు చూసుకుని మరీ వారిని పిలిచి పెద్ద పీట వేస్తున్న మంత్రి తనను గెలిపిస్తే అన్నీ జాగ్రత్తగా చూసుకుంటానని కచ్చితమైన హామీ ఇస్తున్నారట. దీంతో మంత్రి గారు ఏ ఎండ బారినా పడకుండా చల్లగా ఉన్న చోటనే బిల్డింగులో ఉంటూ చేస్తున్న ఈ ఓట్ల వేట ఎంతవరకూ వర్కౌట్ అవుతుందో చూడాలి.

# ఎన్నికల్లో ముస్లిం మహిళల డిమాండ్లు

**దళితులకంటే ముస్లింలు వెనుకబడి ఉన్నారని జస్టిస్ సచార్ కమిటీ వెల్లడించిన విషయం తెలిసిందే. దీనిప్రకారం పాలకులు వారిని సమసమాజంలో భాగస్వామ్యులను చేసే ప్రయత్నాలు చేయాల్సి ఉంది. అయితే అందుకు వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వంలో వారిపై దాడులకు తెగబడ్డారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న వారి ఆర్థిక పరిస్థితి ఈ ఘటనలతో మరింత సంక్లిష్టంగా మారింది. దీంతో ఈ దేశంలోనే పుట్టిపెరిగిన తమను ఓటు బ్యాంకులా చూడొద్దని, తమకు విద్యా,వైద్యంతో పాటు పరిశుభ్రమైన పరిసరాలు ఉండేలా నూతన పాలకులు శ్రద్ధ చూపాలని, గోరక్షక దాడులను అరికట్టాలని వారు కోరుకుంటున్నారు.**



**రాజధాని వార్తలు :** రెండు దశాబ్దాలుగా హిందూత్వ శక్తులు గుజరాత్‌ను తమ ప్రయోగశాలగా మార్చేశాయి. రాష్ట్రంలోని ముస్లింలు తమ జీవనం, భద్రతను నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తూ రాజ్యాంగపరమైన ప్రాథమిక హక్కులను కోరుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలోని ముస్లింలు ఏమి కోరుకుంటున్నారే విషయాలప అనేక సంస్థలు, గ్రూపులు మేనిఫెస్టోలను విడుదల చేశాయి. తమ సమాజంపై దాడులకు పాల్పడే వారిపై ఎస్సీ, ఎస్టీ (వేధింపుల నిరోధక) చట్టం, 1989 మాదిరిగానే నాన్ బెయిల్ నేరంగా ఉండే వేధింపుల నిరోధక చట్టం ఒకటి తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. మైనార్టీ కోఆర్డినేషన్ కమిటీ (ఎంసీసీ)తోపాటు అల్పా సంఖ్యాక్ అధికార్ మంచ్‌లు ఈ డిమాండు చేస్తున్నాయి. ముస్లింలు అనేక సంవత్సరాలుగా వ్యవస్థీకృత హింస ఎదుర్కొంటున్నారు. దుస్తుల దగ్గర నుంచి తినే ఆహారం వరకు ముస్లింలు లక్ష్యంగా మారుతున్నారు. తమను సమాజంలో ఒక భాగంగా చూడటం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముస్లింల భద్రతకు హామీ ఇస్తే వారు వెంటనే 70 శాతం మద్దతును పొందుతారని అల్పాసంఖ్యాక అధికార్ మంచ్‌కు చెందిన న్యాయవాది శంషాద్ పఠాన్ చెప్పారు.

ఖుర్షీదా రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో నివసిస్తారు. తన భర్త ఆవు పాలు అమ్మేవారని చెబుతున్నారు. "కానీ 2017లో గోరక్షకులు నా భర్తను కాల్చిచంపారు" అని ఆమె తెలిపారు. ఆమెకు ఎనిమిది మంది పిల్లలు. వారిని పోషించడం ఖుర్షీదాకు భారంగా మారింది.

"ఓరోజు ఉమర్ గహన్ కర్ గ్రామం నుంచి ఆవులను తీసుకొని వస్తున్నారు. రైల్వే గేట్ల సమీపంలో ఆయనపై కాల్పులు జరిపి, అక్కడే వదిలి వెళ్లిపోయారు" అని ఖుర్షీదా తెలిపారు.గోరక్షణ పేరుతో జరుగుతున్న హత్యలను నిషేధించాలంటూ ఇటీవల ఖుర్షీదా ఢిల్లీ వచ్చి డిమాండ్ చేశారు. దేశంలోని ఇతర ప్రాంతాలనుంచి కూడా ముస్లిం మహిళలు ఆమెకు మద్దతుగా వచ్చారు.వీరంతా కలసి ఓ మేనిఫెస్టో రూపొందించారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలన్నీ తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు. "ముస్లింలు నివసించే ప్రాంతాల్లో పరిశుభ్రత కావాలి. విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపడాలి. సరైన రోడ్లు కావాలి. రోడ్లు ఇంత దారుణ పరిస్థితుల్లో ఎందుకుంటున్నాయి?" అని సైరా ఆరమ్ అనే మరో మహిళ ప్రశ్నిస్తున్నారు.'మూక దాడులను, వదంతులతో జరిగే హత్యల నిరోధానికి ఓ చట్టం తీసుకురావాలి. నా డిమాండ్లలో ఇదొకటి. ఇంకో డిమాండ్ ఏంటంటే, ట్రిపుల్ తలాక్‌ను నేరంగా గుర్తించి శిక్షించడాన్ని రద్దు చేయాలి" అని షబీనా ముంతాజ్ కోరుతున్నారు. "మహిళా రిజర్వేషన్ బిల్లును అన్ని పార్టీలు ఆమోదించాలి. ఇంటిని, కుటుంబాన్ని, సమాజాన్ని మహిళలు చక్కబెట్టగలిగినప్పుడు, రాజకీయాల్లో కూడా వారు రాణించగలరు" అని అఖ్తరీ బేగమ్ అభిప్రాయపడ్డారు."మేం కూడా ఈ దేశంలో పౌరులమే. మాకూ సమాన హక్కులుంటాయి. మేం ముస్లింలమనే కారణంగా మాపై వివక్ష చూపిస్తే మేం సహించం" అని హసీనా ఖాన్ తెలిపారు.

- ఖాన్

# కావాల్సిన వాడు



**పార్లమెంటు అనగానే పారిశ్రామిక వేత్తలు, ధనికులదే అన్న అభిప్రాయం పోవాలంటే కన్నయ్యకుమార్ విజయం సాధించాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు. దేశంలో రాజకీయ మార్పుకు కన్నయ్యే కేంద్రంగా మారతారని అణగారిన వర్గాలు, మైనార్టీలు బలంగా భావిస్తున్నాయి. అతడు గెలిస్తే ఇప్పటివరకు డబ్బులిచ్చి ఓట్లు కొనే బడా వర్గాలకు, కావాలను కుంటే రూపాయి విరాళంగా ఇచ్చి కూడా కావాల్సిన వారిని ఎన్నుకునే సత్తా ఈ ప్రజల కుందని నిరూపించినట్లవుతుంది.**

**రాజధాని వార్తలు :** కన్నయ్యకుమార్.. దేశంలో ఈ పేరు మారుమ్రోగుతోంది. అతడు ఢిల్లీ సెంట్రల్ వర్సిటీలో ఒక మాజీ విద్యార్థి నాయకుడు. బీహార్‌లోని బెగుసరాయ్‌లో పేద కుటుంబం నుంచి వచ్చాడు.తల్లి అంగన్‌వడీ కార్యకర్త. తండ్రి వ్యవసాయ పనులు చేస్తారు. విద్యార్థి నాయకుడిగి ఢిల్లీ వర్సిటీలో కులమతాలకు అతీతంగా వ్యవహరిస్తుంటే ఓర్చుకోలేని హిందూ మతోన్మాదులు పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడారని వీడియోలు సృష్టించారు.దీంతో బీజేపీ ప్రభుత్వం అతనిపై దేశద్రోహం నేరం నమోదు చేసి జైల్లో పెట్టింది. ఇప్పటికీ ఏవో కేసులు బనాయిస్తూనే ఉంది.

ఇప్పటివరకు ధనవంతులకు, పారిశ్రామిక వేత్తలకు మాత్రమే పార్లమెంటుకు పోటీ చేస్తుండగా, దేశ చరిత్రను మార్చేందుకు అతడు బెగుసరాయ్ పార్లమెంటు నియోజక వర్గంలో సీపీఐ తరపున పోటీ చేస్తున్నాడు. ఇతడు డబ్బులు లేక అడుక్కుంటున్నాడని బీజేపీ ఎద్దేవా చేసింది. దీనిపై స్పందించిన కన్నయ్య అవును.. నేను దేశంలోని ప్రతి వ్యక్తి నుంచి రూపాయి విరాళాన్ని కోరుతున్నా అని ప్రకటించారు. దీంతో రెండు రోజుల్లో అతనికి రూ. 50 లక్షల పైగా నగదు చేకూరింది. అతడికి మద్దతుగా 250 మంది విద్యార్థులు రంగంలోకి దిగారు. బీజేపీ పార్టీ ఆయనపై గిరిరాజ్‌సింగ్‌ను పోటీకి పెట్టింది. కన్నయ్యతో పోటీ పడలేనని అధిష్టానికి మొర్రపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. నువ్వు ఓడిపోయినా తప్పకుండా నీకు మంత్రి పదవి ఇస్తామని బుజ్జగించి బీజేపీ అతనినే పోటీలో ఉంచింది.

**కన్నయ్యకు అన్ని వర్గాల నుంచి పెరుగుతున్న మద్దతు చూసి మతోన్మాదులు మండిపడుతున్నారు. దానిలో భాగంగానే శివసేన పార్టీ పత్రిక సామ్నా అతనిపై విషం కక్కింది. ఈవీఎంలు టాంపరింగ్ చేసైనా అతన్ని ఓడించాలని లేదంటే పార్లమెంటు భవనం మెట్ల వద్ద అతనికి విషం ఇవ్వాలని పేర్కొంది.**

బీహార్ బెగూసరాయ్ పార్లమెంటరీ నియోజకవర్గంలో ఓటమి భయంతో తల్లడిల్లిపోతున్న బీజేపీ నడిరోడ్లపై రాద్ధాంతానికి దిగుతోంది. ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ శక్తులు సీపీఐ అభ్యర్థి డాక్టర్ కన్నయ్యకుమర్ ప్రచారాన్ని అడ్డుకునేందుకు యత్నించగా యువసేన తిప్పి కొట్టింది. మొహల్లా నగరంలోని లోహియానగర్‌లోకన్హయకుమార్ రోడ్‌షో నిర్వహించారు. భారీ సంఖ్యలో అభిమానులు ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు. మొహల్లా ప్రజలు ఆయనకు నీరాజనం పలికారు. ఈ సన్నివేశంతో ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్‌కు చెందిన మూకలు రోడ్డును దిగ్బంధనం చేశారు. ఓ పది మంది మొత్తం ర్యాలీనే నిలువరించేందకు యత్నించారు. ఇంతలో విద్యార్థి సంఘ కార్యకర్తలు, ఇతర యువకులు రోడ్డుకు అడ్డంగా పెట్టిన బల్లలను తీసివేశారు. దీంతో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు యాగీకి దిగారు. నల్లజెండాలతో ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇక కన్నయ్య వెంట వచ్చిన యువకులూ మతవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో లోహియా నగర్‌లోయుద్ధవాతావరణం నెలకొంది. పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను చెదరగొట్టారు. వీడియోక్లిప్పింగ్‌ల ఆధారంగా కుట్రదారులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని లోహియనగర్ ఔట్ పోస్ట్ రామ్ ప్రతాప్ పాశ్వన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ అభిషేక్ ఆనంద్ మాట్లాడుతూ, నిందుతులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### ఇది గిరిరాజ్ కుట్రే

ఎన్నికల్లో కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఓడిపోతాననే భయంతోనే సంఘవ్యతిరేక శక్తులను రెచ్చగొడుతున్నారని కన్నయ్య ఆరోపించారు. మతోన్మాదుల దౌర్జన్యకాండను జనం సహించలేని స్థితిలో ఉన్నారని, బీజేపీని చిత్తుగా ఓడించటం ఖాయమన్నారు. కేంద్ర మంత్రి గిరిరాజ్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

### ముస్లింల నీరాజనం

ముస్లిం ఓట్లపై గంపెడు ఆశతో ముస్లిం అభ్యర్థిని లాలూ ప్రసాద్ స్థాపించిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ )రంగంలోకి దించగా ముస్లింలు మాత్రం సీపీఐ అభ్యర్థి కన్హయకుమార్‌ను అక్కున చేర్చుకుంటున్నారు. సాదరంగా ఆలింగనం చేసుకుంటున్నారు. తల నిమిరి మద్దతు చెబుతున్నారు. ముస్లింలకు రక్షణ కేవలం సీపీఐ అభ్యర్థి కన్హయకుమార్‌కే సాధ్యమని ముస్లిం నేతలు భావిస్తున్నారు. లోహియనగర్‌లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తల ఆగడాలను కన్హయకుమార్ అనుచరులు తిప్పికొట్టటంతో ముస్లింల్లో కించిత్ ఆత్మస్థైర్యం పెరిగినట్టేనని పరిశీలకులు భావిస్తున్నారు. కన్నయ్య కుమార్ ఎన్నికల్లో గెలిచి పేదసాదల గొంతును పార్లమెంటులో వినిపించాలని దేశ ప్రజలు ముక్త కంఠంతో కోరుకుంటున్నారు.

- బోస్

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com